సాక్షి
వికారాబాద్

గురువారం । 22 । ఆగస్టు । 2024



ఏళ్లు గడుస్తున్నా పూర్తికాలే..

మూడున్నరేళ్లు కావస్తున్నా జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 8లో▸



ఓటరు సవరణ చేపడతాం

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. 8లో▸



అన్నదాత ఆందోళన

వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా ఎరువులు సమస్య తీరడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్



తాండూరు: ఎన్నికల సమయంలో ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్నదాతలను దగా చేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో మాట తప్పినందుకు నిరసనగా నేడు (గురువారం) తాండూరులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పేరిట ఎకరాకు రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాటను తుంగలో తొక్కి కుటుంబానికి రూ.2 లక్షలు అంటూ నిలువునా మోసం చేశారన్నారు. దీంతో జిల్లాలోని ఎంతో మంది పేద, మధ్యతరగతి రైతులు రుణమాఫీ కాక తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని తెలిపారు. వానాకాలం సీజన్ పెట్టుబడి సాయం ఇప్పటి వరకు జమ కాలేదన్నారు. ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

మర్పల్లి స్టేషన్‌కు 'ఇంటర్ సిటీ' హాల్టింగ్

మర్పల్లి: బీదర్ నుంచి మర్పల్లి మీదుగా ఉదయం 7 గంటలకు హైదరాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ రైలును గత గురువారం నుంచి మర్పల్లి స్టేషన్‌లో ఆపలేదు. దక్షిణమధ్య రైల్వే అధికారుల ఆదేశం మేరకే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఆగడం లేదని స్థానిక స్టేషన్ మాస్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ఇంటర్ సిటీ సాధన సమితి నాయకులు, బీజేపీ స్థానిక నాయకులు మంగళవారం సాయంత్రం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఫోన్ ద్వారా రైల్వే శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎన్నో పోరాటాల అనంతరం గత జనవరిలో.. మర్పల్లికి ఇంటర్ సిటీ స్టాప్ దక్కిందని తెలిపారు. ఎనిమిది నెలలు తిరక్కుండానే హాల్టింగ్‌ను ఎత్తివేస్తే జిల్లా ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని వివరించారు. అయితే మర్పల్లిలో ట్రైన్‌ను ఆపినా తమ శాఖకు ఎలాంటి ఆదాయం రావడం లేదని డీజీఎం తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీ నిత్యం ఇక్కడ సుమారు 50 మంది ప్రయాణికులైనా ఎక్కేలా అవగాహన కల్పిస్తామని హామీ ఇవ్వడంతో హాల్టింగ్‌ను పునరుద్ధరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళల రక్షణకే హెల్ప్‌లైన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమెన్ హెల్ప్‌లైన్ సభ్యులు

కొడంగల్ రూరల్: ఆపద సమయంలో మహిళలు, విద్యార్థినులు హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్లకు కాల్ చేయడం తోపాటు తమను తాము రక్షించుకునేందుకు ప్రయత్నం చేయాలని సఖీ ఉమెన్ హెల్ప్‌లైన్ జిల్లా సభ్యులు ఎం సుమలత, బీ రమావతి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డొమెస్టిక్ వాయిలెన్స్, బాల్య వివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే విద్యార్థినులు, మహిళలు డయల్ 181, 1098, 100కు కాల్ చేయాలన్నారు. తక్షణ సాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్ రఫియాఖానం, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నిరుపేదల వైద్యం కోసం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే పార్టీలకు అతీతంగా పథకం అమలయ్యేలా చూస్తామన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

లాభాల లాజిస్టిక్స్

ఆర్టీసీ కార్గో సేవలకు పెరుగుతున్న ఆదరణ

- వేగంగా పార్సిల్స్ చేరవేత
- ఇతర సంస్థలతో పోలిస్తే ఖర్చు తక్కువే..
- గంటల వ్యవధిలో డెలివరీ



పరిగి బస్టాండ్‌లోని కార్గో సెంటర్

పరిగి: నష్టాల ఒడిదుడుకుల మధ్య సాగుతున్న ఆర్టీసీకి కార్గో సేవలు బూస్టనిచ్చిందనే చెప్పవచ్చు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రజారవాణా సంస్థ.. ప్రస్తుతం కార్గో పార్సిల్స్ సేవలను తీసుకొచ్చి లాభాలను ఆర్జిస్తోంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను నష్టాల బాట నుంచి గట్టెక్కించేందుకు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలు ఇస్తోంది. ఆదాయ వనరుగా మారింది. 2020 జూన్ 19న ప్రారంభమైన లాజిస్టిక్స్ సేవలు నాలుగేళ్ల కాలంలో మంచి గుర్తింపు పొందింది.

ఉపాధినందిస్తూ..

కార్గో సేవలను అన్ని ప్రధాన బస్టాపుల్లో విస్తరించడం తోపాటు సర్వీస్ ఏజెంట్లను నియమించారు. కమీషన్ ప్రాతిపాదికన ప్రైవేటు ఏజెంట్లను నియమించారు. పార్సిల్ బుకింగ్ మీద 12శాతం, పార్సిల్ రిసీవింగ్ మీద రూ.10 కమీషన్ చెల్లిస్తున్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. కమీషన్ ఏజెంట్లు.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్సిల్స్‌ను వినియోగదారులకు అందజేయడం, స్థానికంగా బుక్ చేయడం ద్వారా రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు డిపోల పరిధిలోని ప్రతి మండల కేంద్రంతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో బుకింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

ఆర్టీసీకి మంచి ఆదాయం

లాజిస్టిక్స్ సేవలతో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. వేల సంఖ్యలో బుకింగ్స్ జరుగుతుండగా రూ. లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. నగరాలు, పట్టణాల నుంచి నిత్యం ఏదో ఒక వస్తువును ప్రజలు ఆర్టీసీ కార్గో ద్వారా పంపుతున్నారు. జిల్లాలోని మూడు డిపోల నుంచి దాదాపు రూ.2.47 కోట్ల ఆదాయం వచ్చింది. వికారాబాద్ డిపోకు రూ.1,32,79,311, తాండూరు డిపోకు రూ.81,40,564, పరిగి డిపోకు రూ.32,98,698 వరకు ఆదాయం సమకూరింది.

కాలానుగుణంగా నూతన సేవలు

ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిల్స్, సరుకు రవాణా



పార్సిల్ బుక్ చేసిన వ్యక్తికి రసీదు ఇస్తున్న ఏజెంట్

చేయడమే కాకుండా ప్రజలను ఆకట్టుకునేలా వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతోంది. రాయితీలు ప్రకటించడం, ప్రత్యేక సందర్భాల్లో పలు ఆఫర్లు ఇవ్వడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించడం ద్వారా మంచి ఆదాయం వస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ వేడుకకు రాలేని భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి ఆర్టీసీ కార్గో సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించడానికి కార్గో కౌంటర్ల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించలేని, భద్రాచలానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. రూ.116 చెల్లిస్తే తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చారు. రాఖీ పండుగ నేపథ్యంలో కార్గో ద్వారా సుదూర ప్రాంతాల్లో ఉండే వారి బంధువులకు రాఖీలను చేరవేశారు. ఇలా కాలానుగుణంగా ప్రత్యేక సేవలందిస్తూ మంచి ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

అందుబాటు ధరల్లో..

ఆర్టీసీ బస్సుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. వారికి అందుబాటు ధరల్లో కార్గో సేవలను అందజేస్తే పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు కార్గో సేవలతో పోలిస్తే ఆర్టీసీలో ధరలు తక్కువగా ఉన్నాయి. దీంతో వినియోగదారులు ఇటు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రైవేటు కొరియర్ సంస్థల ద్వారా పార్సిల్స్ గమ్యస్థానానికి చేరుకోవాలంటే సమయం పడుతోంది.. కానీ ఆర్టీసీ కార్గో ద్వారా గంటల వ్యవధిలో వినియోగదారుడికి పార్సిల్ అందుతోంది.

నాలుగేళ్లలో జిల్లాకు వచ్చిన ఆదాయం

డిపో	పార్సిల్స్	రూ.లలో..
వికారాబాద్	79,321	1,32,79,311
తాండూరు	71,866	81,40,564
పరిగి	28,502	32,98,698

సేవలు అద్భుతం



తాము ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసే వస్తువులను ఆర్టీసీ కార్గో ద్వారానే గ్రామానికి తెచ్చుకుంటున్నాం. గతంలో ప్రైవేటు కార్గోల ద్వారా తెచ్చుకునే వాళ్లం. ఎక్కువ సమయం తోపాటు ఖర్చు కూడా ఎక్కువగానే ఉండేది. ఆర్టీసీలో ఈ సమస్యలు లేవు. పార్సిల్ త్వరగా వస్తోంది, ఖర్చు కూడా తక్కువే. వస్తువు ఇంటికి సురక్షితంగా చేరుతోంది.

– చెన్నయ్య, ఇప్పాయిపల్లి

మరింత విస్తరింపజేస్తాం



ప్రతి గ్రామానికి ఆర్టీసీ కార్గో సేవలు అందేలా కృషి చేస్తాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం అన్ని మండల కేంద్రాల్లో లాజిస్టిక్స్ ఏజెన్సీలు అందుబాటులో ఉన్నాయి. తక్కువ సమయం, తక్కువ ఖర్చు, పార్సిల్స్‌ను సురక్షితంగా గమ్యానికి చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– విశ్వనాథం గౌడ్,
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లాజిస్టిక్ సెల్స్ టీంలీడర్



వైద్య కళాశాల పనులకు భూమిపూజ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- వికారాబాద్‌లో వైద్య కళాశాల పనులకు శంకుస్థాపన

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ వైద్య కళాశాల పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాల కోసం 30 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. రూ.235 కోట్లతో భవనాలు, వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంతనాయక్, ఈఈ శ్రీధర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

ఎల్లమ్మ తల్లీ.. మా భూములు కాపాడమ్మా

- రైతుల వేడుకోలు
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

దుద్యాల్: ఎల్లమ్మ తల్లీ నీవే మా భూములను కాపాడాలంటూ మండలంలోని హకీంపేట్, లగచెర్ల, పోలేపల్లి, పులిచెర్ల తండా, రోటి బండా తండాకు చెందిన రైతులు వేడుకున్నారు. ఫార్మా కంపెనీ కోసం ఆయా గ్రామాల నుంచి ప్రభుత్వం 1,300 ఎకరాల భూమిని సేకరించనున్న నేపథ్యంలో బుధవారం రైతులు నిరసన ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటును ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములను ప్రజలకు హాని కలిగించే ఫార్మా కంపెనీలకు కేటాయించాలని చూడటం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేశారు. మా భూముల్లో ఎలాంటి కంపెనీలను ఏర్పాటు చేయడానికి వీలులేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలం అధ్యక్షుడు సురేశ్‌రాజ్, రైతులు బసప్ప, గోపాల్‌నాయక్, రాజునాయక్, వెంకటయ్య, శిరీష్, తుల్సిరామ్, లక్ష్మణ్ నాయక్, శేఖర్ యాదవ్, చంద్రమ్మ, రాములమ్మ, హెనీబాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతు రామన్న పాట వైరల్

దుద్యాల్: హకీంపేటకు చెందిన భూ బాధితుడు గుండెమోని రాములు తన పాట ద్వారా రైతుల గుండెకోతను కళ్లకు కట్టారు. 'అభివృద్ధి చేస్తుందని గెలిపించిన సర్కారు.. పేదల భూములను లాక్కుంటోంది' అని పాటలో వివరించారు. ప్రాణం పోయినా సరే ఫార్మాకు భూములు ఇచ్చేది లేదు.. పోరాటానికి సిద్ధం కావాలని బాధిత రైతులకు పిలుపునిచ్చారు. ఈ పాట సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



అంతారంలో సీసీ రోడ్డు, మురుగు కాలువను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

నాణ్యత ఉంటేనే బిల్లులు

అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని అంతారం గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలల్లో వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, మంచి భోజనం వడ్డించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్, లైట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఎంపీడీఓ విశ్వప్రసాద్, అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మి, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఏఈ నందిని, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, మాజీ సర్పంచు శేఖర్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

తాండూరు టౌన్: పట్టణ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులను అడిషనల్ కలెక్టర్ సుధీర్ బుధవారం పరిశీలించారు.పనుల పురోగతి గురించి మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, డీఈ ఖాజా హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బసవేశ్వర్ నగర్‌లో పంచాయితీరాజ్ శాఖ నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు.

సత్వరం పూర్తి కావాలి

పెద్దేముల్: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరం పూర్తి కావాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని తట్టెపల్లిలో నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని, అమ్మా ఆదర్శ పాఠశాల పనులను, పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సబ్‌సెంటర్ పనులు ఆగిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వారంలో ఒక్కరోజు కాకుండా నిత్యం ఫీవర్ సర్వే చేయాలని ఏఎన్‌ఎం సుజాతకు సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, పంచాయతీ రాజ్ డీఈఈ నాగభూషణం, ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రాజారత్నం, పీఆర్ ఏఈ నందిని, పంచాయతీ కార్యదర్శి గోపాల్, వైద్య సిబ్బంది ప్రమోద్, సుజాత, హెచ్‌ఎం జోజప్ప పాల్గొన్నారు.

ముగ్గురు జిల్లా అధికారుల బదిలీ

అనంతగిరి: ముగ్గురు జిల్లా అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఉన్నారు. ఈయన్ను యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కమిషనర్ కార్యాలయం నుంచి మోహన్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ సూర్యాపేటకు బదిలీ కాగా, పౌర సరఫరాల మేనేజర్ సుగుణాబాయి మేడ్చల్‌కు బదిలీ అయ్యారు.

కలిసి ఉంటేనే ఎస్సీలకు బలం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

- రోడ్డెక్కిన మాలల ఐక్య వేదిక సభ్యులు
- అధికారులకు వినతిపత్రాల అందజేత



అనంతగిరి: వికారాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో ఒక్క కుటుంబంగా ఉన్న వారిని విడదీస్తున్నారని, విభజించి పాలించడం వల్ల నష్టాలే తప్ప లాభాలు ఉండవని మాలల ఐక్య వేదిక సభ్యులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై తీర్పును నిరశిస్తూ రిజర్వేషన్ బచావో సమితి ఇచ్చిన భారత్ బంద్ పిలుపు మేరకు బుధవారం తాండూరులో ఆందోళన చేపట్టారు. వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్సులను ఆపేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బస్టాండ్ వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి, తాండూరు డీఎస్పీ, ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరశన తెలిపారు. వర్గీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు వారిని అక్కడి నుంచి బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కలిసి ఉంటేనే ఎస్సీలకు బలం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే వర్గీకరణ ప్రక్రియను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నీరటి హన్మంతు, మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు పటేల్ కిష్టయ్య, తాండూరు మండల అధ్యక్షుడు మల్లప్ప, నాయకులు కాశప్ప, శేఖర్, రాములు, సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వద్దు

అనంతగిరి: అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల మాదిగ, ఉపకులాలను ఎస్సీ వర్గీకరణ పేరుతో విడగొట్టరాదని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాజ్ కోరారు. ఎస్సీ వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా బుధవారం వికారాబాద్ ఆర్టీసీ బస్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ పేరుతో మాల, మాదిగ, ఉపకులాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. దేశంలో ఐదు శాతం ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గాలయ్య, జిల్లా నాయకులు రాములు, వెంకటయ్య, రాజు, హనుమంతు, శ్రీకాంత్, అనంత రాములు, శంకరయ్య, శ్రీనివాస్, కృష్ణ, శంకర్, అడ్వకేట్లు ఆనందం, గోపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో పాత నేరస్తుడికి రిమాండ్

బషీరాబాద్: ఎక్మాయిలో ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన పాత నేరస్తుడు బోయిని నాగప్పను బషీరాబాద్ పోలీసులు కటకటాల పాలు చేశారు. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్యామ్ అనే వ్యక్తిపై మంగళవారం నాగప్ప గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఇతన్ని అరెస్టు చేసిన పోలీసులు బుధవారం తాండూరు కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

కొడంగల్ రూరల్: రైతు రుణమాఫీలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ మండలాలకు చెందిన రైతులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇప్పటి వరకు 30శాతం రైతు రుణమాఫీ కూడా జరగలేదని, వంద శాతం రుణమాఫీ అయ్యే వరకు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'అమ్మ ఆదర్శ' ఖాతాల్లో నిధుల జమ

అనంతగిరి: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు ప్రారంభించిన 966 పాఠశాలలో 451 బడుల్లో పనులు పూర్తయ్యాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఇందుకు గాను ఎంపీడీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్స్, స్క్రూటినీ ఆఫీసర్స్‌తో పరిశీలన అనంతరం రూ.4.41 కోట్లు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాలో జమ చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే పాఠశాలన్నింటికీ 25 శాతం నిధులు పనులు ప్రారంభించక ముందే మంజూరు చేయబడినవి. ప్రస్తుతం మిగిలిన నిధులను కూడా బుధవారం మంజూరు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మొయినాబాద్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ గేదె ప్రాణం తీసింది. తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపల్లి బాలయ్య కుటుంబం గేదెల పోషణ చేస్తూ జీవనం సాగిస్తుంది. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం గేదెలను గండిపేట చెరువు వైపు మేపడానికి తీసుకెళ్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ ఓ గేదెకు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది.

రైలు ఢీకొని.. వ్యక్తి మృతి

కొత్తూరు: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని వినాయక స్టీల్ పరిశ్రమ సమీపంలో రైలు పట్టాలపై బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక స్టీల్ పరిశ్రమ వెనకాల రైలు పట్టాలపై మృతదేహం పడి ఉందని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించగా సుమారు 40–45 ఏళ్ల లోపు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

నందిగామ: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ఎస్సై గోపాలకృష్ణ సూచించారు. మండల పరిధిలోని మేకగూడలో బుధవారం గ్రామస్తులకు ట్రాఫిక్‌రూల్స్‌పై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. పూర్తి కాలే!

- నాలుగు మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- మూడున్నరేళ్లు అవుతున్నా పూర్తి కాని వైనం

అధికారుల తీరుతో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు జాప్యం అవుతున్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దాపురించింది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



పరిగిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

వికారాబాద్: మూడున్నరేళ్లు కావస్తున్నా జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణ పనులు ముందుకు సాగటం లేదు. 2021లో స్థలాలు పరిశీలించిన అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేయగా.. మరికొన్ని చోట్ల పనులు సైతం ప్రారంభించలేదు. మరో చోట చేసిన పనులకు బిల్లులు రాక, వచ్చిన బిల్లులలో తమకు వాటాలివ్వాలని ప్రజాప్రతినిధులు పేచీ పెట్టడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. జిల్లాకు చెందిన నాలుగు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లు నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా అధికారులను ఆదేశించింది. ఈ బాధ్యతలు జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. గజ్వేల్ తరహాలో మార్కెట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావించింది. వెంటనే మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణానికి అవసరమయ్యే స్థలాలు సైతం కేటాయించారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీల్లో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు నాలుగింటిలో ఒక్కచోట సైతం పనులు పూర్తి కాలేదు.

నిర్మాణానికి భారీగా వ్యయం

నాలుగు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపడుతుండగా ఇందులో ఒక్కో దానికి రూ.మూడు నుంచి ఆరు కోట్లు వెచ్చించనున్నారు. అప్పట్లో ప్రభుత్వం ప్రారంభించగా నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడిచినా వాటిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో ఆ పనులు మాత్రం ముందుకు సాగటంలేదు. ఇదే సమయంలో జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి రెండు నుంచి ఆరు ఎకరాల స్థలం(మున్సిపాలిటీల సామర్థ్యాన్ని బట్టి) కేటాయించారు. పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మిస్తుండగా వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో వాటి జనాభా సామర్థ్యం, అవసరాలను బట్టి ఐదు నుంచి ఆరు ఎకరాల్లో నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అంటే..

రాష్ట్రంలో ఏడేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. అధునాతన కార్పొరేట్ షాపింగ్‌మాల్ తరహాలో సమీకృత మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో స్టాల్లు, పెద్దపెద్ద వాణిజ్య దుకాణాలు, బ్లాక్‌లు, అన్ని వస్తువులు ఒకేచోట లభ్యమయ్యే సూపర్ మార్కెట్‌ల నిర్వహణకు వీలుగా నిర్మాణాలు చేపడతారు. ఒక్కసారి ఈ మార్కెట్‌కు వచ్చారంటే ఇంటికి అవసరమయ్యే అన్ని రకాల వస్తు సామగ్రి, కూరగాయలు, పళ్లు, పూలు, ఆకుకూరలు, చేపలు, మాంసం, చికెన్ అన్ని ఒకే చోట లభిస్తాయి. ఇలా అన్నింటికోసం ప్రత్యేకమైన బ్లాకులు ఏర్పాటు చేస్తారు. మార్కెట్‌కు వెళ్లేందుకు మంచి రోడ్డు సౌకర్యం, దగ్గరలోనే అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు సైతం కల్పిస్తారు. ఇలా ఎంతో ఉన్నతాశయంతో మొదలు పెట్టారే తప్ప పనులు మాత్రం పూర్తి చేయలేదు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

అదనపు కలెక్టర్ సుధీర్



సంగాయిపల్లితండాలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్

యాలాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అధికారులను సుధీర్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని సంగాయిపల్లితండాలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల పురోగతిని తనిఖీ చేశారు. హెల్త్ సబ్‌సెంటర్, మురుగుకాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జ్వరాల గుర్తింపులో భాగంగా గ్రామంలో సర్వే చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, ఫ్యాన్లు, బోర్డులు ఉండేలా ఎంపీడీఓ పుష్పలీలకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పనులు నాణ్యతగా చేపట్టాలని, అసంపూర్తిగా పనులు చేపట్టకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు
- సామాజిక తనిఖీలో రూ.3.49 లక్షల రికవరీ
- కుల్కచర్ల ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి పని కల్పించే విధంగా ఉపాధి హామీ సిబ్బంది వ్యవహరించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటుగా పనిచేయని వారికి పనులు చేసినట్లు బిల్లులు వేయించి అవినీతికి పాల్పడిన కుల్కచర్ల ఫీల్డ్ అసిస్టెంట్ రాంజీకి రూ.89 వేల జరిమానా వేస్తూ సస్పెండ్ చేశామన్నారు. బండవెల్కిచర్లలో చనిపోయిన వ్యక్తికి ఒక వారం రోజులు అటెండెన్స్ వేయగా, అది కంప్యూటర్ ఆపరేటర్ మిస్టేక్ అని తేల్చారు. అతని కుటుంబ సభ్యులు పనిచేశారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పుట్టపహాడ్ నుంచి గాధిర్యాల్ గ్రామం వరకు మొక్కలు నాటకుండానే నాటినట్లు చూపి బిల్లులు చెల్లించారని ఆడిట్ సిబ్బంది సభ దృష్టికి తెచ్చింది. మొత్తంగా రూ.9.44 కోట్ల పనులు ఏడాదిలో జరిగాయని అధికారులు వెల్లడించారు. ఆడిట్ సిబ్బంది పేర్కొన్న నివేదిక ఆధారంగా రూ.3.49 లక్షలు రికవరీ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరళదేవి, కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ఖరీం, ఏపీఓ చంద్రశేఖర్, అంబుడ్స్‌మెన్ రాములు, విజిలెన్స్ అధికారి భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, ఆడిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సవరణ చేపడతాం



సమావేశంలో అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించి వచ్చే జనవరి 6న తుది జాబితా విడుదల చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇంటింటా సర్వేలో బూత్ లెవల్ అధికారులు వెళ్లి పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు చేపడుతారన్నారు. చిరునామా మార్పు, తప్పులు సవరణ వంటి పనులు చేస్తారన్నారు. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. వచ్చే అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించి, వాటిపై అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరిస్తారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ నేమత్ అలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

కుల్కచర్ల: వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఊరడి శివ(23) కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం శివ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అతడు కుల్కచర్ల మైలమ్మ చెరువు సమీపంలోని తూము దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశారు. అందరితో కలిసిపోయి స్నేహపూర్వకంగా మెలిగే శివ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

యాలాల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 10 లోపు ప్రవేశాలు పొందవచ్చన్నారు. డ్రాఫ్ అవుట్, ఉద్యోగ ప్రమోషన్స్ కోసం చదవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ చక్కటి అవకాశమన్నారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి.. మృత్యు ఒడికి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందిగామ: రాంగ్‌రూట్ ప్రయాణం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల శివారులోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఎంఎస్‌ఎన్ పరిశ్రమ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపాలకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం లింబ్యాతండాకు చెందిన సేనావత్ చందు(47) అతడి భార్య జ్యోతితో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై నందిగామ మండలం ధన్‌సింగ్‌తండాకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై షాద్‌నగర్ వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామానికి చెందిన మిద్య సురేశ్ బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంఎస్‌ఎన్ పరిశ్రమ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చందు ఎడమ వైపు కింద పడిపోవడంతో అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్రక్కు ఆయన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సురేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



బడంగ్‌పేటలో మేస్త్రీలకు బహుమతులు అందిస్తున్న భారతి సిమెంట్ ఉద్యోగులు

బడంగ్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ ఆల్ట్రాఫాస్ట్ పేరుతో.. ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్ సాహెర్ అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని రామ్ స్టీల్ డీలర్ దుకాణంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని స్పష్టంచేశారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి ఆల్ట్రాఫాస్ట్ రూ.20 అదనంగా ఉంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 40 మందికి పైగా మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కృషి అభినందనీయం

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నేతలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం సమితి నాయకులు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గీతన్నలకు రూ.2 లక్షల సేఫ్టీ మోకులను అందజేసిందన్నారు. అదే విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ప్రతిపాదించడం, ట్యాంక్‌బాండ్‌పై ఆయన విగ్రహం పెట్టేందుకు సన్నాహాలు చేయడం హర్షణీయమన్నారు. గౌడల సంక్షేమానికి కృషి చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు కృష్ణగౌడ్, అంజయ్యగౌడ్, నాగార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శీర్షాసనం వేసి వినూత్న నిరసన

- భూ సమస్య పరిష్కరించడం లేదని యువకుడి ఆందోళన
- తహసీల్ కార్యాలయంలో తలకిందులుగా నిరసన
- స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్



జీవన్



భూ సమస్య పరిష్కరించాలని శీర్షాసనం వేసి నిరసన తెలియజేస్తున్న జీవన్

ఇబ్రహీంపట్నం: నెలల తరబడి తిరుగుతున్నా భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు తహసీల్దార్ కార్యాలయంలో శీర్షాసనం వేసి వినూత్న నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి గ్రామానికి చెందిన ఉల్లింతల జయసుధ 374 సర్వే నంబర్‌లో ఎకరా 32 గుంటల భూమిని 15 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. ఈ సర్వే నంబర్‌లో ఎకరా రెండు గుంటల భూమి సీలింగ్ కింద ఉండటంతో ధరణి పోర్టల్ వచ్చిన అనంతరం నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా నుంచి తొలగించి, తమ భూ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు జయసుధ దరఖాస్తు పెట్టుకున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో టాటా ఇనిస్టిట్యూట్‌లో సోషల్ సైన్సెస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఆమె కుమారుడు జీవన్ ఆందోళనకు దిగాడు. తమ భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో శీర్షాసనం వేసి నిరసన వ్యక్తం చేశాడు. స్పందించిన తహసీల్దార్ సునీత మాట్లాడుతూ.. సమస్య ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని, నిషేధిత జాబితాను పరిశీలించి, ఆ సర్వే నంబర్‌లోని రైతులకు నోటీసులు అందజేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ సూచన మేరకు జీవన్ నిరసన విరమించాడు.

అధికారుల విఫలం

ధరణి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలయ్యారని జీవన్ ఆరోపించాడు. సమస్యను పరిష్కరించాలని నెలల తరబడి తమ కుటుంబసభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యావంతులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో గమనించాలని పేర్కొన్నాడు. 20 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపాడు.

కంది సాగు.. ఖరీఫ్‌లో బాగు

- అధిక లాభాలు పొందొచ్చు
- షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం





రేగడిదోస్వాడలో సాగు చేస్తున్న కంది పంట (ఫైల్)

షాబాద్: అంతర్జాతీయంగా ఏర్పడిన పరిణామాలతో పత్తికి ధర పడిపోవడంతో రైతుల్లో నిరాశ ఆవహించింది. దీంతో పత్తికి ప్రత్యామ్నాయంగా కంది సాగు చేసుకొని అధిక దిగుబడి పొందొచ్చని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచిస్తున్నారు. కంది పంటను ఆశించే పురుగు, తెగుళ్ల నివారణ కోసం రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆయన తెలిపారు. ఖరీఫ్, రబీలో సాగు చేసే కంది పంటను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆకుపచ్చ పురుగు

కంది పెరిగే దశలో పురుగు ఆశిస్తుంది. ఆకులు, పూతను చుట్టుగా చుట్టుకొని లోపల ఉండి పంటను నాశనం చేస్తుంది. దీని నివారణకు 1.6 మీ.లీ మోనోక్రోటాస్ లేదా 2.0 మీ.లీ క్వినాలపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు

ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటూ ఒక కాయ నుంచి మరోకాయను ఆశిస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ తప్పక పాటించాలి.

ఎండు తెగులు

మొక్కలో కొంతభాగం ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండమొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. నివారణకు తెగులు అధికంగా కనిపించిన పొలాల్లో పొగాకు లేదా జొన్నతో పంట మార్పిడి చేయాలి. ఐసీపీఎస్ 87119, ఐసీపీఎస్ 8863 అనే కంది రకాలు ఈ తెగులను తట్టుకుంటాయి.

వెర్రి తెగులు (స్టెరిలిటి మొజాయిక్)

ఈ వైరస్ తెగులు సోకిన మొక్క లేత ఆకుపచ్చ రంగు గల చిన్న ఆకులను విపరీతంగా తొడుగుతుంది. పూత పూయదు, ఈ తెగలు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. నల్లి నివారణకు లీటరు నీటిలో 3 గ్రాములు నీటిలో కరిగే గంధపు పొడి లేదా 4 మి.లీ డైకోఫాల్‌ను కలిపి వారానికి ఒకటి, రెండుసార్లు పిచికారీ చేయాలి.

మాక్రోఫోమినా ఎండు తెగులు

ముదురు మొక్కల కాండంపైనా నూలుకంటే ఆకారం కలిగిన గోధుమ వర్ణపు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చల చుట్టూ గోధుమ వర్ణమయంలోనూ మధ్యభాగం తెలుపు వర్ణంలో ఎండిపోతాయి. కొన్నిసార్లు కొమ్మలు మాత్రమే ఎండిపోతాయి. నివారణకు ఎంఆర్‌జీ66 కంది రకాన్ని సాగు చేయాలి. కంది ఎక్కువ కాలం ఒకే పొలంలో వేయరాదు.

పంటకోత నిల్వ

అన్ని కాయలు ఎండిన అనంతరమే కంది పంటను కోయాలి. లేకపోతే పూత రెండు నెలల వరకు పూస్తూనే ఉంటుంది. ఎండిన తరువాత కట్టెలతో కొట్టి కాయల నుంచి గింజలను వేరు చేయాలి. కందులను బూడిద లేదా వేప ఆకులు కలిపి నిల్వ చేస్తారు. నిల్వ చేసేటప్పుడు పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండబెట్టాలి.

సమగ్ర సస్యరక్షణ

- వేసవిలో లోతు దుక్కి చేస్తే భూమిలోని పురుగు కోశస్థ దశలు బయటపడి పక్షులు ఏరుకుతింటాయి. ఈ పురుగు ఎక్కువగా ఆశించే పంటలపైన జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుములు, ఉలవ, వరి మొదలైన పంట మార్పిడి చేయాలి.
- ఖరీఫ్‌లో అంతర పంటగా 7 సాళ్లు, రబీలో 3 సాళ్లు పెసర, మినుము వేయడం ద్వారా పరాన్న జీవులు వృద్ధి చెందడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ నాలుగు సాళ్లు జొన్న రక్షిత పైరుగా విత్తాలి.
- పురుగు గుడ్డును, తొలిదశ పురుగులను గమనించి వెంటనే 5 శాతం వేప గింజల కషాయాన్ని లేదా సంబంధమైన మందు(అజా డిరాక్టిన్)లను పిచికారీ చేయాలి.